# ఆపద్ధర్మం

మైథిలి చెల్లెలు కూతురు పెళ్ళికి వెళ్లి హైదరాబాదు తిరిగివచ్చింది. రాగానే అలవాటుచొప్పున తన ఇద్దరు కూతుళ్ళు ఎలాఉన్నారోనని వాళ్ళగదిలోకి వెళ్ళిచూసి వచ్చింది. చిన్నకూతురు కళ్ళు నులుపుకుంటూ అప్పుడేలేచింది. పెద్దమ్మాయి లేచి నౌకర్లకు పనులు పురమాయిస్తున్నది. తండ్రి కాఫీ, టిఫిన్ తీసుకుని ఆఫీసుకు వెళతాడని ఏర్పాట్లుచేస్తోంది. అవి చూసివచ్చిన మైథిలి హాల్లో ఒక కుర్చీలో కూలబడి పోయింది.

''అమ్మా, ముఖం కడిగావా? కాఫీ తీసుకురానా? నాతో అక్కడికివస్తావా?'' పెద్దకూతురు అడిగింది.

''ముఖం కడిగాను. కాని వస్తాలే'' అంది.

ప్రకాశరావు స్నానంచేసి డ్రస్‌చేసుకుని కిందికి దిగివచ్చాడు.

''మిథూ! అలా కూర్చుండిపోయావేం? కాఫీతాగుదాం రా? ప్రయాణం బడలికగా ఉందా? రా అన్నీ సర్దుకుంటాయి.''

కాళ్ళీడ్చుకుంటూ వెళ్ళింది మైథిలి.

''పెళ్లికబుర్లు సాయంత్రం వచ్చివింటాను. ఇవాళకమిటిమీటింగ్ పొద్దున్నే తొమ్మిదింటికిఉంది. నేను తొందరగావెళ్ళాలి'' ఆతడు గబగబా వెళ్ళిపోయాడు.

అంతలో చిన్నకూతురువచ్చింది. ఇద్దరు కూతుళ్ళమధ్య కూర్చుని కాఫీ తాగింది మైథిలి.

"అన్నయ్యవచ్చాడా?" బలవంతంగా కళ్లుతెరిచి అడిగింది.

"లేదమ్మా రేపుకదా వస్తానన్నది?" చిన్నకూతురు చెప్పింది.

మైథిలి అక్కడఉన్న బల్లమీద కూచుంది. చూసినవాళ్ళు శోష వచ్చిందేమో

అనుకునేటట్టుగాఉంది ఆమె ముఖం. కూతురి బలవంతమ్మీద స్నానంచేసి, భోజనం చేసీచెయ్యనట్టుగా తిని పైకి తనగదిలోకి వెళ్లి మంచమ్మీద దొర్లటం మొదలు పెట్టింది. ఆమె మనసు కుతకుత ఉడుకుతున్నట్లుంది.

రెండురోజులపాటు ఆమె అలా స్తబ్దుగా ఉండటం ఇదివరకెప్పుడూ ప్రకాశ రావు ఎరగడు. పిల్లలు సరేసరి: ఆమెకు చురుకుతనం ఎక్కువ. ఏవేళకు చేయ వలసినపని ఆవేళకు అది ఆ ఇంట్లో జరగవలసిందే. జరిగేటట్టు ఆమె చేస్తుంది. వేళకాగానే కాఫీ తీసుకుందామా? భోజనం చేద్దామా? అని అందరినీపిలిచే మైథిలి, ఎవరుపిలిచినా నిర్లిప్తంగా ఉండటమూ, అడిగినదానికి అంటీ ముట్టనట్టు జవాబులు ఇవ్వటమూ చూస్తే పెళ్ళిల్లో ఆమె ఎవరితోనో ఘర్షణపడినట్టు సంశయం కలిగింది ప్రకాశరావుకు. లేకపోతే ఎంతో ఉత్సాహంతో సంతోషంతో పెళ్ళికి వెళ్లిన మనిషి ఇలా నీరవురాలై రావడమేమిటి?

ఎవరితో ఘర్షణపడి ఉంటుంది? అందరికంటే ఎక్కువగా కన్ను చెదరిపోయే నగలూ, చీరెలూ ఆమెకు ఉన్నాయి.

పిల్లకు ఇంకా పెళ్ళి చేయలేదనిఎవరయినా ఆక్షేపణచేసిఉంటారా అంటే సంబంధం కుదిరింది అంది. వచ్చే నెలలోనే ముహూర్తంకూడా నిశ్చయమైంది. కాబోయే వియ్యాలవారు గుంటూరులోనే ఉన్నారు. తనహోదానంతా పెళ్లికిముందే చూపించాలన్నట్టుగా బయలుదేరింది.

ఇంక ఏమయిఉంటుంది?

అబ్బాయి పెళ్లివిషయంలో ఏదయినా మాట వచ్చిందా? మేనకోడలిని చేసు కోనని ముందే అన్నగారితో చెప్పింది.

ప్రకాశరావు ఆలోచనలో పడ్డాడు.

మైథిలిచదువుకున్నది"విద్యాదదాతివినయమ్"అన్నమాట ఆమెకు అన్నివిధాల వర్తిస్తుంది. పిల్లలను క్రమశిక్షణలోఉంచింది తన ఇష్టా ఇష్టాలను కళ్ళతోనే చూపి స్తుంది ప్రకాశరావును ప్రేమిస్తుంది ఆరాధిస్తుంది గౌరవిస్తుంది కాని అతడు తనకు ఇష్టంలేనిపని ఏదయినా చేసినట్లు గ్రహించినా చేయబోతున్నట్టు తెలిసినా నోరు మెదపకుండా కళ్లతోనే తన అయిష్టాన్ని తెలుపుతుంది. ఆతర్వాత అతడు మరి నోరు మెదపడు. కాలు కదపడు.

ఆమె ఆయింటికి ఫైనాన్స్ మినిస్టరూ హోమ్ మినిస్టరూకూడా! ఆమె ఆ స్థాయికి ఎదిగి ఆ స్థానాలను ఆక్రమించింది. ఎవరూ కాదనలేకపోయారు.

"మిథూ! పెళ్లికి వెళ్లివచ్చినప్పటినుంచీ ఒకమాదిరిగా ఉన్నావేమిటి? నీకు నచ్చని సంఘటనలేవయినా జరిగాయా? నీవిలాఉంటే నాకు పిచ్చెక్కిపోతోంది. ఏమిటో చెప్పు" లాలనగా అడిగాడు.

"పెళ్లి గొడవలు ఏమయినా ఉంటే వాళ్లల్లోవాళ్ళే సర్దుకుంటారు. నేనెవర్ని మధ్య?" ఆమె నిర్లిప్తంగా జవాబిచ్చింది.

"మరేమిటోయ్: నీవు మహా ఆవేదన పడిపోతున్నావు? ఓ మాటలేదు-పలుకూ లేదు. సంగతేమిటో చెప్పు? నాకాఫీసు పని సాగడంలేదు."

ఆమె జవాబివ్వకుండా తలదించుకుంది.

"అమ్మాయి పెళ్లికి మనం కావలసినవన్నీ కొన్నాం కదూ? ఇంకేమయినా కొనాల్సినవి ఉన్నాయా? అన్నట్టు బడ్జెటు ఎలా ఉంది?" మాట మార్చాడు.

"ఉన్న కాష్ ఇంట్లో చాలా? లేకపోతేచెప్పు" అనడిగాడు.

మైథిలి కళ్ళు వెడల్పుచేసుకుని తీక్షణంగా అతడివైపు చూసింది.

ప్రకాశరావు ఆచూపులకే తడబడ్డాడు.

మైథిలికి ప్రకాశరావన్నట్టుగానే పెళ్లికి వెళ్ళి వచ్చినప్పటినుంచీ మనసులో కదలి ఘోష మొదలయింది.

పెళ్లి ఉదయం ఎనిమిది గంటలకయితే ఆకిందటిరోజురాత్రే గుంటూరు చేరుకుంది. ముహూర్తం కాగానే భోజనాలయ్యాయి. ఆ మధ్యాహ్నం ఒంటిగంటకు కాబోయే వియ్యాలవారింటికి వెళ్లి ఇంకా కొరతలు ఉన్నాఏమోనన్న సంశయ నివారణ చేసుకుని, కాఫీతాగి అక్కడినుంచి స్నేహితురాలు నీరజ యింటికివెళ్లింది. ఆమెను చూడగానే నివ్వెరబోయింది.

ఆమె మంచంలో ఉంది కళ్ళల్లో ప్రాణాలున్నాయి. కూతురు తల్లిదగ్గరఉండి మందులిస్తూ హార్లిక్సు కలిపిఇస్తూ దగ్గరకూర్చుంది ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది.

మైథిలి చెప్పులు ఒక మూల విడిచి మంచం దగ్గరగా ఒక స్టూలు మీద కూర్చుంది అమ్మకు ఏమయిందని కూతురికి సైగచేసి అడిగింది.

అలికిడికి నీరజ కళ్లు తెరిచింది.

ఆ స్థితిలోఉన్న ఆమెనుచూసి మైథిలికి కళ్ళు చెమ్మగిల్లాయి.

"ఏమయిందినీకు? ఇలా అయిపోయావేమిటి? ఏం జబ్బు? మీ ఆయన ఎక్కడ?" ఆమె ఫాలభాగమ్మీద చేత్తోరాస్తూ అడిగింది. నీరజ కళ్లల్లో నీళ్లూరాయి.

"ఆయనలేరు మిథూ! ఆయనలేరు!" కణతలమీదుగా ప్రవహించిన కన్నీటిని మైథిలి తుడిచింది.

"బేబీకి పెళ్లిచేశారా? చాలా రోజులక్రితమే సంబంధం కుదిరిందన్నావుగా?"

"వాళ్లు చేసుకోనన్నారు మిథూ అందుకే ఆయన గుండె ఆగిపోయింది. తర్వాత అది ఉద్యోగంలోచేరింది. నేను పెళ్లి చేయలేకపోయానా అది ఉద్యోగం చేసి నన్ను పోషిస్తోంది" ఆ మాటలు నూతిలోనుంచి వచ్చినట్టుగా ఉన్నాయి. మాట్లాడుతూ ఉండగానే ఆమెకు దుఃఖం ముంచుకొచ్చింది.

''సంబంధం ఎందుకుకుదరలేదు? నీవు వాళ్ళతో తూగలేకపోయావా? పోనీ ఇంకోటి చూడలేకపోయావా?"

"ఎలా చూడను మిథూ? ఎలా చూడను?''

ఆయనకు సర్వీసులో ఒక్కగా నొక్క చాన్సు వచ్చింది ప్రమోషనుకు. ఆ ఆర్డరు చేతికివ్వటానికి ఐదువేలు ఆఫీసరుకు లంచమివ్వాల్సి వచ్చింది. అంత ఇచ్చినా ఆ ప్రమోషను ఎన్నాళ్లో నిలవలేదు. ఆయన తరువాత వచ్చిన ఆఫీసరు వెంటనే రివర్ట్ చేశాడు. ఆ ప్రమోషన్ నిలుపుకోవటానికి కొత్తగావచ్చిన ఆయనకు ఆరువేలివ్వాల్సి వచ్చింది. కష్టపడికూడబెట్టిన డబ్బు ఇలా ఖర్చయింది. ఇంక పెళ్ళి ఎలా చేయమంటావు? అబ్బాయిని బ్రతిమిలాడి రెండుసార్లు ముహూర్తం పెట్టించాము. అప్పటికీ మేమందుకోలేక పోయాం. అతడెంత కాలం మా కోసం కూర్చుంటాడు? అతడికెక్కడికో చాలా దూర ప్రాంతానికి ట్రాన్స్ఫరయింది. పెళ్ళిచేసుకుని వెళ్లిపోయాడు. దానితోనే ఆయనకు గుండెపోటు వచ్చింది. వెళ్లిపోయారు."

''ఆంటీ! మీరు ఏం తీసుకుంటారు?'' అడిగింది బేబీ.

''నాకేంవద్దమ్మా. పెళ్ళివారింట్లో అన్నీ అయ్యాయి. నాకు మిమ్మల్నిద్దరినీ చూసిన తృప్తి మిగిలింది. ఆ అన్నట్టు నీవెక్కడ పనిచేస్తున్నావమ్మా?'' అడిగింది భుజమ్మీద చెయ్యివేసి.

"అమ్మను వదిలిపెట్టి ఎలా వెళ్ళను ఆంటీ? ఇంటికివచ్చే పిల్లలకు ఏడవ క్లాసు పరీక్షకు కోచ్ చేస్తున్నాను పది మందికి. అంతే'' తల పక్కకుతిప్పుకుంది.

"పైసా పైసాగా కూడబెట్టిన ఆ పదివేలు వాళ్ళకు అర్పించారా?'' బాధగా అడిగింది మైథిలి.

"కాలం అలా ఉంది. వాళ్ళూ అలా డబ్బు కుమ్మరించే ఆ ఉద్యోగాలలో ప్రమోషన్లు సంపాదించారేమో? ఎవరిని అనగలం చెప్పుమిధూ?మొదటిప్రమోషన్ ఇచ్చిన ఆయన వెళ్ళగానే వెంటనే ఇంకోకాయన వచ్చాడు. ఆయనకూ ఆరు నెలలకే బదిలీ అయింది. వాళ్ళపేర్లు నాకు ఎలా తెలుస్తాయి, ఇచ్చినవాళ్ళకు తప్ప ? ఇదంతా నా దురదృష్టమనుకున్నాను కాని, ఆయనకిది మనోవ్యాధిగా పరిణమించింది. గుండెజబ్బు తెచ్చుకున్నారు" అంది నీరజ.

సుమారు గంట కూర్చున్నది మైథిలి వాళ్ళింట్లో. నీరజ మనోవ్యాధి మందులతో తగ్గదు. ఆమెను చూస్తుంటే ఈమె ఎన్నాళ్ళు బ్రతుకుతుంది ? ఆ తర్వాత ఆ అమ్మాయి గతేమిటి ఒంటరిగా ఉన్న ఆడపిల్లలకు ఎన్నికష్టాలు ! ఆలోచించింది మైథిలి. మరి అక్కడ కూర్చోలేకపోయింది.

"ఈ రాత్రికే వెళ్తానునేను. వచ్చేటప్పుడు రెండు రోజులుంటానని చెప్పాను. కాని ఉండలేను" అంటూ లేచింది.

''మిధూ ! నామీద నీకెంత ప్రేమ" నీరు కళ్ళు ఆనందబాష్పాలతో నిండుకున్నాయి,

"నీరూ ఏడ్చి నీజబ్బు ఎక్కువ చేసుకోకు. అమ్మాయికి నీవొక్కదానివైనా అండగా ఉండటానికి ప్రయత్నించు. నేను మరోసారివస్తాను'' అని బయలుదేరింది మైథిలి.

లంచాలు తీసుకుని, ఒక పెళ్ళి చెడగొట్టి, మరొక ప్రాణంతీసిన ఆ హంతకుడు ఎవరు ? మైథిలి తీవ్రంగా ఆలోచిస్తున్నది.

భర్త ఫైళ్ళను తనూచూస్తుంది. ఆయన ఫైలు ఏమని రాశాడో చూసిగాని ఫైలు మూయదు. ఆ ఫైళ్ళవల్ల తనకేమయినా సమాచారం దొరుకుతుందా? అయినా వాటిని ఇప్పుడెలా చూడగలదు! ఆఫీసుకు వెళ్ళిపోతాయి కదా? కాని ప్రకాశరావుకో అలవాటుంది. తాను ఎవరికి, ఎప్పుడు ఏ ఉళ్ళో ఛార్జి ఇచ్చాడో, మరెవరి దగ్గర ఏ ఊళ్ళో ఎప్పుడుచార్జి తీసుకున్నదీ పేరూ ఊరూ తేదీలతో సహా ఆయన డైరీలో ఉంటాయి.

మైథిలి ఇంటికిరాగానే అవన్నీ ముందరవేసుకుని కూర్చున్నది. ఒక్కొక్క పేజీ చదువుతూ ఆ పూటంతా గడిపింది.

ఆ సాయంత్రానికి దొంగ దొరికాడు.

అయ్యో! ఎంతపని జరిగింది ఆందోళనగా అనుకుంది.

ఈ పాపానికి పరిహారం ?

ఏం చెయ్యాలి తను ?

నీరూను ఎలా బ్రతికించాలి ?

రాత్రంతా ఆలోచించింది. ఎవరు పలకరించినా మౌనమే ఆమె జవాబు. ఆ మరునాటి ఉదయం నీరజ పేరిట పదివేలకు ఒక డ్రాఫ్టు తీసుకుని రిజిస్టరు పోస్టులో పంపించింది.

నీరూ బ్రతకాలి, అమ్మాయి ఎవరినైనా పెళ్ళిచేసుకుంటే నీరూ బ్రతుకుతుంది.

అమ్మాయి ఎవరినయినా ప్రేమించి రిజిస్టర్డుమేరేజి చేసుకోవాలి. కూతురు పెళ్ళిచేసుకుంటే నీరూ వ్యాధి నయమవుతుంది.

అదే తనకు కావాలి. తను అనుకున్న పనిచేసిన తరువాతయినా మైథిలి తృప్తిపడలేదు. ఒక విధమైన ఏహ్యాభావం, కలవరం చోటుచేసుకున్నాయి ఆమె మనసులో.

పైసపైసా లెక్కచూసుకునే మనిషి. ఒక్కసారిగా అయిదువేల రూపాయలు చేతికివస్తే ఎక్కడివని ఎందుకు నిలదీసి అడగలేదు తను? డబ్బును చూడగానే తనుకూడా ప్రలోభానికి లోనైందా ?

తనమీద తనకే అసహ్యం పుట్టుకొస్తోంది.

"మిధూ ! పెళ్ళికి స్థలమంటూ ఏర్పాటు చెయ్యద్దూ ? ఆ ముహూర్తానికి నాలుగు పెళ్ళిళ్లున్నాయట. షాదిఖానా ఒకటి మనంచూసింది త్వరగా బుక్ చెయ్యాలి. మేనేజరు ఫోనుచేశాడు. ఆరు గంటలకయినా మనం డబ్బిచ్చి బుక్ చేసుకోవాలి" ఆఫీసుకు వెళ్ళటానికి సిద్ధ మవుతున్నాడు ప్రకాశరావు.

మైథిలి కళ్ళెత్తి చూసింది. ఆమె కళ్ళల్లో రాగద్వేషాలు పోటీ పడుతున్నాయి.

"ఈ పెళ్ళి వాయిదా వెయ్యండి" తలఎత్తకుండా అన్నది.

''ఎందుకని ? లగ్నం పెట్టుకుని అంతా సిద్ధం చేసుకున్న తరువాత ఎందుకు వాయిదావెయ్యాలి ? నా సర్వీసు ఉండగనే వాళ్ళ పెళ్ళిళ్ళు అయిపోవాలి."

''ఆ సంగతీ నాకూ తెలుసు. అయినా వాయిదా వెయ్యాల్సిందే !" కచ్చితంగా చెప్పింది.

''అదే_ఎందుకూ అని ? దానికి కారణం మనమా లేక పెళ్ళివారా ? వాళ్లు మరేదయినా సంబంధం చూసుకుంటే మనమేం కావాలి?" ఆందోళనగా అన్నాడు.

తన కూతురుపెళ్ళి ఆగిపోతుందని అతడు పడుతున్న ఆవేదనంతా ఆమె ఒక కంట కనిపెడుతున్నది.

"డబ్బు తక్కువవుతుంది. అందుకే వాయిదా వెయ్యమంటున్నాను."

"మొన్న అడిగితే చాలినంత ఉందన్నావు ?"

"ఆ మాట నిజమే. మొన్నఉన్నది. ఇవాళ లేదు. అప్పు తీరిస్తే అయిపోదూ ?''

''నేనెప్పుడూ అంత అప్పు చెయ్యలేదే?'' అతడు ఇంకా ఆశ్చర్యంలో నుంచి తేరుకోలేదు.

"మీరు అప్పుచెయ్యలేదు. కాని పుచ్చుకున్నారు. పరోక్షంగా ! దానికి కారణభూతమైన వాటికి కూడా మీరే బాధ్యులు. అవన్నీ కలిపి పదివేలు. అవి న్యాయంగా ఎవరికి చెందాలో వాళ్ళకు పంపించేశాను."

అతడి కనుబొమలు రెండూ గుసగుస లాడుతున్నట్టుగా దగ్గరికి చేరాయి.

"నేను నిన్నపొద్దున వచ్చినప్పటి నుంచీ కాఫీ అయిన తాగలేదు. నిన్నటి నుంచీ చాలా బాధగాఉంది. అసలు మీకేమంత అవసరమొచ్చింది అలా కక్కుర్తి పడటానికి ?" ఆమెలో మళ్ళీ ఆవేశం తలెత్తింది.

ఆమె ఏమంటున్నదీ అతనికి అర్థంకాలేదు.

"నాకు వివరంగా చెప్పు ?'' కుర్చీ దగ్గరికి లాక్కుని కూచున్నాడు.

''ఏమని చెప్పాలి ? మీరు ఆనాడు ఒక్కసారిగా అయిదువేలు ఎక్కడి నుండి వచ్చాయని నన్ను బ్యాంకులో వెయ్యమన్నారు ?"

''అవి మా నాన్నగారిచ్చిన భూమి అమ్మి, మా తమ్ముడు తన భాగం తీసుకుని మిగిలింది నాకు పంపాడు. అందులో తప్పేముంది ? కాకపోతే వాడు రెండువేలు ఎక్కువ తీసుకున్నాడు. వాడు ఇంటిదగ్గర కనిపెట్టుకుని ఆ పను లన్నీ చూస్తున్నాడు. కనుక తీసుకోమని నేనే చెప్పాను. ఇందులో నా కక్కుర్తి ఎక్కడుంది ?"

''మరి అంతకుముందు ముప్పయివేలు డిపాజిట్ చెయ్యమన్నారు. అవెక్కడివి"?

''మానాన్న యిల్లు అమ్మాడు. ఎనభైవేలు వచ్చింది. దాన్ని వాటాలు చేసి పంపమని ఉత్తరంరాశాను. వాడిని అదే మా తమ్ముడిని ఇరవై ఎక్కువ తీసుకోమన్నాను-పిల్లల కాలేజి చదువుకు కావాలి కనుక. నా భాగండబ్బే నీ కిచ్చింది. అదికూడా తప్పేనా ?''

మైథిలి మనసులోని చీకటి క్రమంగా మాయమవుతున్నది. బరువు తగ్గుతున్న కొద్ది నోట మాట రావటంలేదు.

"మాట్లాడరేం మేడమ్? నేను లంచగొండిని కానని నమ్మకం కలిగిందా ఇప్పుడైనా?"

మైథిలి మాట్లాడలేదు.

"నీ సందేహాలన్నీ ఒక్కొక్కటే తీరిస్తే మంచిది. ఆఫీసుల్లో ప్రమోషను ఆర్డర్లు సామాన్యంగా ఊరికే చేతికివ్వరు. ఎంతో కొంత తీసుకుని ఆఫీసరు చేతి

కిచ్చినా-మళ్ళీ కొత్తవాడువచ్చి ఫైలు చూసుకుని దానికేదో పుల్ల అడ్డంవేస్తాడు. వచ్చిన ప్రమోషన్ నిలుపుకోటానికి మరి కొంత ఇచ్చుకోవాలి. ఇవి ఆఫీసుల్లో జరిగే సామాన్య విషయాలు. నేను తీసుకోని వాడినని నా కేమయినా గౌరవముందా అంటే నేను అందరికీ అడ్డంగా ఉన్నట్టు భావించి నా కెప్పుడు ట్రాన్స్ఫరవుతుందా అని చూస్తారు మనసులో తిట్టుకుంటారు. ఇవన్నీ నీకెలా చెప్పను?'' అన్నాడు.

అతడిని అనుమానించి భోజనంకూడామానేసిన మైథిలిముఖం వికసించింది.

"మనిషికి అనుమానాలు మనసులో మొలకలెత్తకుండానే ఉండాలి. ఒకవేళ మొలకలెత్తితే వెంటనే నివృత్తి చేసుకోవటం మంచిది. నీ ప్రయత్నానికీ నీ పరిశోధనకీ అభినందిస్తున్నాను. సరే-ఇప్పుడు ఆ మేనేజరికి ఫోనుచేసి ఆ బిల్డింగ్ పెళ్లికి ఫిక్సుచేయమంటావా చెప్పు? నాకు చాలాపని ఉంది ఆఫీసులో'' తొందరపెట్టాడు.

భర్తమాటలకు మైథిలితృప్తిచెందింది. భర్తవల్ల నీరజకుటుంబానికిఅన్యాయం జరగలేదని తెలుసుకున్న తరువాత ఆమె మనసు కుదటపడ్డది. కళ్ళు తృప్తితో మెరిశాయి ముఖంలో అందమైన మెరుపు మెరిసింది.

ఆ వెండి వెలుగే అతడికి కావాలి. కాని అది సహజమైనది కాదుకదా? తను అందమైన అబద్ధమాడి తెప్పించినది. ఏంచేయగలడు అంతకుమించి? ఆపద్ధర్మమనుకున్నాడు.

❋ ❋